# రెండు నక్షత్రాలు

** శ్రీ ఎం. కృష్ణమూర్తి పట్నాయకులు

[నేడు ఎక్కడచూచినా నిర్భాగ్యుల పిల్లలు అడుక్కుంటూ ఉండడం యెక్కువగా చూస్తూన్నాము. వాళ్ళ దుర్దశనుచూస్తే మనస్సు నీరైపోతుంది. వాళ్ళ యీ దుర్దశను పోగొట్టే మార్గమే లేదా? అకాలమృత్యువు వాతబడ్డ యిద్దరు పిల్లల విషాదచరిత్ర యిందులో చిత్రించడమైనది.]

●

మిట్టమధ్యాహ్నం—

చండప్రచండమైన ఎండ. కిందనూ మీదనూ మాడ్చేవేడి. భయాన్నిగొల్పే వేళ.

అస్థిపంజరసమం. నిర్జీవవిగ్రహం. అంతా నగ్నం. సర్వం ధూళిధూసరితం. అత్యధిక ఆకలి జ్వాలాసమన్వితం.

అదీ పరిస్థితి. ఇద్దరు అభాగ్య పసికందులు నడిబజారులో తిరుగాడుతూయున్నారు.

బంగినపల్లి, సువర్ణరేఖా, బెంగుళూరూ, గోవా......

తీపి తీపి. మజామజా. రెండింటికి నాలుగణాలు, డజనుకు రూపాయి రెండణాలు. వేగంరండి. చెల్లిపోతే మరిదొరకవు. చాలాచవుక. పెద్దవైన ముద్దుపళ్లు—మామిడిపళ్ళు!

నలువైపులా ప్రతిధ్వనిస్తూన్నాయి. అంగడి వాళ్ల కేకలు ఆ బజారులో.

ధనికులకా కేకలు అధిక ఆనందం. దరిద్రులకా కేకలు అధికపరితాపం. ధనంతో ఉన్నది ప్రపంచం!

'ఒకుళ్లిన పండు బాబూ!'

ఆశాజనకమైన దృక్కులలో, దీనమైన వదనాలతో, శుష్కించిన చిరుచేతులనుచాచి పసికందుల యాచనాలాపం.

'పోండి దొంగవెధవలు.'

గ్రుడ్లగూబ గ్రుడ్లలా గ్రుడ్లుచేసి గజంలా బలిసిన సాహుకారి గర్జన. పిడుగేమో అది!

'అమ్మా ఆ కుళ్ళినకాయ!'

'వెళ్లండటు'

'కోపపడకమ్మా! తల్లీ!'

'వెళ్తారా లేదా దెష్టపిల్లలు?'

కళ్లురెండు నెత్తిమీద పెట్టుకొని ఒళ్లుతెలీని పళ్లమ్మే గొల్లభామ హూంకరింపు.

'బాబూజీ! ఓపాడైన ఫలం!' వేరొక దుకాణంవద్దను వొకకేక.

'అరె బద్మాష్ క్యాహై? చలో యహాసే'

దుడ్డుకఱ్ఱతో వడ్డించవచ్చే కర్కశహృదయుడైన గుండుతురక చురకలు.

ఆహా ఒక్కడైనా దయార్ద్ర హృదయుడు లేడా?

మనిషికి మనిషీ ఢీకొనే సందు. ఒకదానిపై ఒకటి ఎక్కిపోయియున్న దుకాణాలు. లెక్కకు మించిన కొనవచ్చే వెళ్లేజనం. పెంటపోగుల్లా వున్న పనికిరాని విసరివేయబడ్డ ఎండుగడ్డీ, ఖాళీపళ్లబుట్టలూ, శక్తంతా వెచ్చించినా అమ్మబడని ఎందుకూ కొరగాని కుళ్లినపళ్ళ తుప్పలూ, జనం త్రొక్కుడులచే చితికి, నలిగి, అసహ్యాన్ని కలిబిస్తూ తగని

దుర్గంధంతో నిండి, హరిజనుడు హతాశుడై చివరకు బాటిని ఎత్తిపారవేయలేక విడువబడియుండి పశువులపాకకన్న కనికిష్టమైయుంటే దృశ్యం. మానవుడు నిలువదగ్గచోటేనా అది అనే శంకాపూరితం —అది—పళ్ళబజారు !

ఈ పరిస్థితినిచూస్తే మానవుడే ఉన్నాడా ? మానవులెనన్న చింత యేవ్యక్తికైనా వుందా ?

ధనమే ప్రధానాశయం. స్వార్థమే స్వర్గం. వివేచనా, వివేకం, శూన్యం. కరుణ అంతకన్నా నాస్తి.

అవే ఆ అంగడివాళ్ళ మనస్తత్వాలు. ఆబజారే యిందుకు ప్రతిబింబం.

కొనడానికి వచ్చేవాళ్ళు అనేకులు కొంటారు. కొని దాచుకుంటూ గబగబాపోతారు. వెనుదిరిగి మరిచూడరు. వినిపించుకోరు. ధనముందనా ?

'ఎందుకీ వ్యర్థయాచన!' నిరాశతో నిండిన ఆ చిరుపాపల హృదయాల ప్రతిధ్వని.

కొనగాని కుళ్ళినపళ్లు యెన్నిపడియున్నాయి! అనంతమైన ఆకలిజ్వాలలు, అత్యధికమైన పిన్నవయస్సు వ్యామోహం, మరేగతిలేమి —అది—ఆ పాపల దృక్కుల్ని ఆ—ఆ కుళ్ళిన—పళ్ళపైకి మరల్చినై. ఇన్నిపళ్ళు - వారి ఉదరంలోనికి వెళ్ళిపోయినై వెంటనే.

రత్నగర్భయై సకల సస్యసమన్వితమైన భరతమాత బిడ్డలకు నేడీ గతా !

ఎంగిలిమెతుకు—కుళ్ళినపండు—కరువా !

* * *

రహదారి. జనసంచారం, బళ్ళ తిరుగుడులూ అత్యధికం.

ఫుట్ పాత్ పై ఓ యిద్దరు పిల్లలు మృత్యుశయ్యపై విచాణ.

'ప్రఖ్యాతిగన్న లివర్ క్యూర్ !' పెద్దగా ప్రకటించి యీవిధంగావుంటే రోగిష్ఠి శిశువు నయమవగలదని మచ్చుకై ప్రక్కనువేసే వికారమై భయాన్ని గొల్పే శిశువాకారం—కాదు—అంతకన్నా కనికష్టం. పెద్ద భాండవంటి కడుపూ—సన్నని కాళ్లూ చేతులూ—పెద్దపుఱ్ఱె—ఆపిల్లల ఆకారాలు—నయమవని భీకరరోగపీడనఉంటే ఛాయలు, ప్రాణాలు క్షణాల్లో ఉంటేస్థితి గోచరిస్తూన్నాయి.

అయ్యో నాయనలారా ఎంతటి పరిస్థితి వచ్చింది బాబూ !

కన్నతల్లి కడుపుమంట వర్ణింప ఎవరితరం ? దిక్కులేని బిడ్డల్నిచూచి మాత హృదయం యెంత పరితపిస్తుంది !

'నా చిట్టితండ్రీ!' చిరునవ్వు మోముతో శాంతియుతమై ముద్దుగొల్పే ఒక్కమాట—మాత అంటే బాధాతరంగాలలో బంధించుకొనిపోయిన బిడ్డహృదయం యెంత శాంతిస్తుంది !

నిర్భాగ్యులకీ జగతిలో టికానాలేదు ! రణచెండి నాందిపాట—ఆవెనుక కరువుచెండి నగ్ననృత్యం—నాటిఫలితం —తల్లిదండ్రుల ఎడబాటు—నా అనేవ్యక్తి దూరం--సర్వభాగ్యవిహీనం--తగని కష్టపరంపరలు.

ఆ పసికందులు చేసుకొన్న ఖర్మా ?

* * *

రాజులేనిరాజ్యం—దుష్టుడైన రాజా—విజ్ఞానవిహీనులై దయాదాక్షిణ్యాలు లేని ప్రజలు—ఈ మధ్య కడగండ్లు నిక్కం. నిర్భాగ్యులకవి మరీ సన్నిహితం. తుదకు ఇంకనూ అవి అధికమై నిలువచోటైనా దొరకడం దుర్లభం.

భయానకమైన పరిస్థితిని చూచి 'అన్నా' అనే జీవియేలేదు.

భావిభారత భాగ్యవిధాతలు, తేజోమయులు, కీర్తిమంతులు, భారతావని మూలస్తంభాలు, కాగల ఇట్టి భారతఅభాగ్యపసికందులు నేడెందరు ఎన్నెన్ని రెంతెంత బాధలకు గురియౌతున్నారో! ఎందరు అకాలమరణానికి ఆహుతియైనారో! ఇంకనూ అవుతున్నారో!

సుఖసౌధంలో విహరించాలనే కోరిక గలవారైతు తెలివిగలిగి మొలిచిన మొలకల్ని కంటికి రెప్పలా సంరక్షించుకోవడమే మార్గం. లేకుంటే?...

* * *

సూర్యుడు పశ్చిమదిశను మునిగాడు. చీకటి తెరలు నలువైపులా వ్యాపించాయి.

'కెవ్వు' మనే శబ్దం ఫుట్‌పాత్ పై ఓ సెకను వినబడి వెంటనే మాయమైంది అంతే.

ఇక ఆ అభాగ్యపసికందులు—భారతబిడ్డలు—ఉజ్వలప్రకాశమానములైన రెండు నక్షత్రాలు—ఈలోకంలో మరిలేరు.

---

## ఒకే అగ్గిపుల్లమీాద ముగ్గురు

ఒకే అగ్గిపుల్లమంటతో వరసగా ముగ్గురు చుట్ట కాని బీడీగాని కాల్చరు. ఈనమ్మకాన్ని ప్రజలంతా నిత్యమూ పాటిస్తూండడం చూస్తూనే ఉంటాం. ఎందుకు వచ్చిందీ ఆచారం?

పూర్వం ఎప్పుడో ముగ్గురు ప్రధానోద్యోగులు మరణిస్తే వారి శవాలకు మంటలు పెట్టారు. ఒక్కనిదితప్ప మిగిలిన ఇద్దరివీ ఆరిపోయాయట. అంచేత ఈ ఉద్యోగి శవంలోని మంటతో తిరిగి ముగ్గురవీ ఒకేసారి వెలిగించారట! ఒకేసారి మూడుమంటలను వెలిగించడం అంటే అగ్ని మృత్యుదేవతలను ఆహ్వానించడం అని అర్థం. అందుచేత ఒకేసారి ముగ్గురు తమతమ చుట్టలనైనా కాల్చరు.


అజంతా చిత్రాలు!



ఆనాడు యేనాడో వ్రాసిన అజంతా చిత్రాలలోని స్త్రీలు అందగత్తెలు. ఆ అందచందాలు ఆ కళా కోమలత్వాలు యీనాటి మహిళా మండలిలో అరుదు. మాతృత్వానికి అర్హత నిచ్చే పరిపూర్ణారోగ్యం ఈనాటి స్త్రీలలో లోపించింది. విడువకుండా "అరుణ" వాడితే ప్రత్యేకంగా స్త్రీలకు యేర్పడే గర్భ సంబంధమయిన రుగ్మతలు అన్నీ తప్పకుండా అంతరిస్తవి. పరిపూర్ణారోగ్యం లభ్యమౌతుంది.

అరుణ

ఋతు సంబంధ దోషాలను అద్భుతంగా నివారించి, ప్రతి స్త్రీకి మాతృత్వ గౌరవాన్ని కలిగించగల ఉత్తమ రసాయనం.

(అన్ని మందుల షాపులలోనూ దొరకును)

ఆయుర్వేదాశ్రమము లిమిటెడ్,

79, గోవింద నారాయణచెట్టి రోడ్,

త్యాగరాయనగర్. మద్రాసు.